



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
16 జూలై 2024
పేజీలు: 02




## లంకతో వన్డే సిరీస్‌కు
# హార్దిక్ దూరం?

శ్రీలంకతో జరగబోయే వన్డే సిరీస్‌కు టీమ్ ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య దూరం కానున్నట్లు తెలుస్తోంది. లంకతో వన్డే సిరీస్‌కు తనను ఎంపిక చేయొద్దంటూ బీసీసీఐని హార్దిక్ కోరినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాల వల్లే ఆయన ఈ జట్టుకు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. దీనిపై బీసీసీఐ స్పందించాల్సి ఉంది. కాగా లంకతో జరగబోయే టీ20 సిరీస్‌కు బీసీసీఐ హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించవచ్చని టాక్.




## ఓటీటీ రికార్డులు బద్దలు కొడుతున్న
# మహారాజ

విజసేతుపతి లీసెంట్ బ్లాక్ బస్టర్ 'మహారాజ'. ఎటువంటి అంచనాలు లేకుండా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ మౌత్ టాక్ తో సంచనాలు నమోదు చేసింది. ఈ చిత్రంలో విజయసేతుపతి నటనకు తమిళ్ తో పాటు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు కూడా బ్రమరథం పట్టారు. తెలుగులోనూ ఈ చిత్రం సూపర్ హిట్ గా నిలిచింది. మహారాజ చిత్రం ఏపీ తెలంగాణ థియేట్రికల్ రైట్స్ కొనుగోలు చేశారు ఎన్వీ ప్రసాద్. ఏపీ, తెలంగాణలో ఎవరు ఊహించని రీతిలో సుపర్ హిట్ టాక్ తెచ్చుకొని పంపిణీదారులకు భారీ లాభాలు ఆర్జించి పెట్టింది. కాగా మహారాజ ఓటీటీ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ సంస్థ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్లలో 50 రోజులుకు పైగా ప్రదర్శింపడిన ఈ చిత్రం తమిళనాడులో 100 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి సెన్సేషనల్ హిట్ సాధించింది. ఇటీవల ఈ చిత్రాన్ని ఓటీటీలో స్ట్రీమింగ్ కు ఉంచింది నెట్ ఫ్లిక్స్ సంస్థ. ఊహించినట్టుగానే ఈ చిత్రం ఓటీటీలో రికార్డులు బ్రేక్ చేస్తుంది. ఈ వారం నెట్‌ఫ్లిక్స్ ఇండియా నంబర్ -1లో ట్రెండింగ్‌లో అవుతోంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నటనకు సూపర్ స్టార్ రజనికాంత్ తో పాటు పలువురు సినీ ప్రముఖులు "X" వేదికగా ప్రశంసించారు.

## దాడి ఘటన తర్వాత.. చెవికి బ్యాండేజ్‌తో
# తొలిసారి పబ్లిక్‌లోకి వచ్చిన ట్రంప్

పెన్సిల్వేనియాలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయితే, ఈ దాడి జరిగిన రెండు రోజుల తర్వాత తొలిసారి పబ్లిక్‌లోకి వచ్చారు. సోమవారం మిల్వాకీలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌కు హాజరయ్యారు.ఈ సందర్భంగా గాయమైన చెవికి బ్యాండేజ్‌తో కనిపించారు. అయితే 78 ఏళ్ల ట్రంప్ ఈ సదస్సుపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఆయన మద్దతుదారులు మాత్రం ట్రంప్‌ను చూడగానే చప్పట్లతో ట్రంప్‌కు స్వాగతం పలికారు. 'యూఎస్‌ఏ.. యూఎస్‌ఏ..' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారందరికీ ట్రంప్ అభివాదం చేశారు. ఇక ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ పేరు ఖరారైంది. పార్టీ జాతీయ సదస్సులో ప్రతినిధులంతా ట్రంప్‌ను అధ్యక్ష అభ్యర్థిగా ఆమోదించారు. తన అభ్యర్థిత్వం ఖరారైన వెంటనే ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఒహాయో సెనేటర్ 39 ఏళ్ల జేడీ వాన్స్ పేరును ట్రంప్ ప్రకటించారు. బాగా ఆలోచించిన తర్వాత ఉపాధ్యక్ష పదవికి వాన్స్ తగిన వ్యక్తి అని నిర్ణయించుకున్నట్లు ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు.






## అంగన్‌వాడీలకు
# శుభవార్త

అంగన్‌వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పదవీ విరమణ పొందే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, సహాయకులకు రూ.లక్ష బెనిఫిట్స్ అందజేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. దీనికి సంబంధించిన జీవోను రెండు రోజుల్లో ఇస్తామని 'అమ్మ మాట – అంగన్వాడీ బాట' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి వెల్లడించారు.

## తెలంగాణను సొంత రాష్ట్రంగా భావించి పనిచేయండి..
# కలెక్టర్లతో సీఎం రేవంత్

తెలంగాణను సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలని జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే కలెక్టర్లు సరైన సేవలు అందించవచ్చని చెప్పారు. ప్రజలకు లబ్ధి చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచనలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవాలని, ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా సంతృప్తి ఉండదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2023, డిసెంబర్ 24న కలెక్టర్లతో మొదటిసారి సమావేశం నిర్వహించామన్నారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని ఆ సమావేశంలో ఆదేశించామని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే పారదర్శకంగా కలెక్టర్ల బదిలీలు నిర్వహించామని చెప్పారు. 'ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే. కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఉన్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే మీరు ప్రజలకు సరైన సేవలు అందించగలుగుతారు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలి. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో మీ నిర్ణయాలు ఉండాలి. ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు



ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోండి. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే మీకు కూడా ఎలాంటి సంతృప్తి ఉండదు. మీ ప్రతీ చర్య ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు తెలిసేలా ఉండాలి. ఈ ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలన అందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉంది. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. ప్రతీ పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతీ నెలా రూ.85వేలు ఖర్చు పెడుతోంది. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా వ్యవస్థ అత్యంత కీలకం. విద్యావ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుడిలా స్పందించారు. కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా మీ పనితనం ఉండాలి. ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత మీపైనే ఉంది. ఇది ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు విశ్వాసం కల్పించాలి.' అని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లు, అధికారులకు సూచించారు.



## ఫేక్ సర్టిఫికెట్స్‌తో వచ్చిన వారిని ఏరివేయాలి
### స్మితా సబర్వాల్

ట్రైయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వ్యవహారంపై ఐఏఎస్ స్మితా సబర్వాల్ స్పందించారు. 'సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చేందుకు కొందరు ఫేక్ సర్టిఫికెట్లు ఉపయోగించారనే వార్తలు ఆందోళనకరం. చాలా మంది తెలివైన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ కావడం వారి గమ్యస్థానంగా పరిగణిస్తారు. మెరిట్ ద్వారానే వారు దానిని చేరుకోగలరు. సమగ్ర విచారణ జరిపి ఇలాంటి మోసగాళ్లను ఏరివేయాలి. రిజర్వేషన్/ కోటాల విషయంలో వ్యవస్థలో మార్పులు అవసరం' అని ట్వీట్ చేశారు.



## సరస్వతిగా ఎంట్రీ ఇస్తున్న
# నివేదా థామస్

అందాల భామ నివేదా థామస్ చాలా రోజుల తరువాత నటించిన తాజా చిత్రం "35 - ఇది చిన్న కథ కాదు" ఆగస్టు 15న రిలీజ్ కు రెడీగా ఉంది. ఈ సినిమా మధ్యతరగతి కుటుంబంలోని ఎమోషన్స్ నేపథ్యంలో దర్శకుడు నంద కిషోర్ తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో నివేదా థామస్ ఓ గృహిణి పాత్రలో నటిస్తుంది. కాగా ఆమె పాత్రకు సంబంధించిన 35 సెకన్ల ఇంట్రో టీజర్ ను జూలై 17న సాయంత్రం 4.35 నిమిషాలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆమె పేరు సరస్వతి అని.. ఆమె పేరుకు ముందు పొడవాతి సర్ నేమ్ ఉంటుందని ఓ కొత్త పోస్టర్ ద్వారా వారు రివీల్ చేశారు. ఇక ఈ సినిమాలో విశ్వదేవ్, ప్రియదర్శిలు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా రానా దగ్గుబాటి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు.. ఐదుగురు మృతి

మహారాష్ట్రలోని ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేసర్ నుంచి పండరీపూర్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పి లోయలో పడియాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరో 45 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఎంజీఎం దవాఖానకు తరలించారు.ప్రమాదం రాత్రి ఒటి గంట సమయంలో జరిగిందని నవీ ముంబై డీసీపీ వివేక్ పన్సారే తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన పరిస్థితులను పర్యవేక్షించారు. బాధితులంతా ఆషాడ ఏకాదశి సందర్భంగా పండరీపూర్ వెళ్తున్నారని చెప్పారు. క్షతగాత్రుల్లో 42 మందిని ఎంజీఎం దవాఖానకు, ముగ్గురిని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించామన్నారు.



## తమిళనాడులో మరో పార్టీ నేత దారుణ హత్య

బీఎస్పీ తమిళనాడు చీఫ్ ఆర్మ్ స్ట్రాంగ్ హత్య మరువకముందే తమిళనాడులో మరో పార్టీ నేత దారుణ హత్యకు గురయ్యారు. నామ్ తమిళర్ కాచి పార్టీ నేత బాలసుబ్రమణియన్‌ను మధురైలోని తాల్లకులం పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతనిపై గతంలో 3 కేసులు ఉన్నాయని, వ్యక్తిగత కక్షలతో హత్య చేసి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారించారు.

## జవాన్లపై చర్యలకు కేంద్రం నో.. సుప్రీంకోర్టుకు
# నాగాలాండ్ సర్కార్

జవాన్ల కాల్పుల్లో 13 మంది నాగాలాండ్ పౌరులు చనిపోయిన కేసుకు సంబంధించి ఆ రాష్ట్ర సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 30 మంది జవాన్లపై చర్యలకు కేంద్రం నిరాకరించడాన్ని నాగాలాండ్ సవాల్ చేసింది. తమ వద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. దీనిపై కోర్టు కేంద్రానికి నిన్న నోటీసులు ఇచ్చింది. 2021 DEC 4న మిలిటెంట్లపై ఆపరేషన్ చేపడుతున్న క్రమంలో పౌరులపై కాల్పులు జరిపినట్లు జవాన్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## ఏపీలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్

రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్విటర్‌లో పోస్ట్ పెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో స్కీమ్ అమలుకు పంద్రాగస్టు నుంచి శ్రీకారం చుట్టనుంది.



## ములుగు జిల్లాలో ఉప్పొంగి ప్రవహిస్తున్న జంపన్న వాగు

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళలను సంతరించుకుంటున్నాయి. ములుగు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జంపన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. జిల్లాలోని ఏటూరు నాగారం మండలంలోని దొడ్ల, మల్యాల గ్రామాల మధ్యన జంపన్న వాగు పొంగి ప్రవహిస్తున్నది. బ్రిడ్జి దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.కాగా, నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్వర్ణ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. భారీ వర్షాల దృష్ట్యా ప్రాజెక్ట్ గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద ఉండొద్దన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దని హెచ్చరించారు.





## జమ్ములో ఎన్‌కౌంటర్.. ఆర్మీ అధికారి సహా నలుగురు జవాన్లు వీరమరణం

జమ్ముకశ్మీర్‌లోని దోడాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ అధికారి సహా నలుగురు జవాన్లు వీరమరణం పొందారు. దోడా జిల్లాలోని దెసా అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో భారత సైన్యం, స్థానిక పోలీసులు సోమవారం రాత్రి 7.45 గంటలకు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో టెర్రరిస్టులు, భద్రతాసిబ్బందికి మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు ఆర్మీ సిబ్బందితోపాటు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని దవాఖానకు తరలించగా ఆర్మీ అధికారితోపాటు మరో ముగ్గురు జవాన్లు మరణించారని అధికారులు తెలిపారు.రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ ప్రారంభమైందని, భారీ కాల్పులు జరిగాయని ఇండియన్ ఆర్మీ ఎక్స్ వేదికగా ప్రకటించింది. 20 నిమిషాలకుపైగా కాల్పులు జరిగాయని పేర్కొంది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ఈ దాడికి పాల్పడింది తామేనని పాకిస్థాన్ ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కు చెందిన కశ్మీర్ టైగర్ ప్రకటించింది. కాగా, వారం రోజుల్లో జమ్ము రీజియన్‌లో ఇది రెండో పెద్ద ఎన్‌కౌంటర్. గతవారం కతువాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు సైనికులు మరణించిన విషయం తెలిసిందే. మరో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు.

## గుంటూరులో మరో దారుణం..

కొత్తరెడ్డిపాలేనికి చెందిన 8వ తరగతి విద్యార్థిని(13).. అదే గ్రామానికి చెందిన గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు ఇంట్లో మంచం మీద శవమై కనిపించింది. బాలిక ఒంటిపై గాయాలు ఉండటంతో నాగరాజే హత్యాచారం చేసి పరారయ్యాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు కొత్తరెడ్డిపాలేనికి చెందిన 8వ తరగతి విద్యార్థిని(13) అనుమానాస్పద మృతి కడుపు నెప్పి అని చెప్పి స్కూల్ నుండి వచ్చేసిన విద్యార్థిని.. స్కూల్ టైం అయిపోయినా ఇంటికి తిరిగిరాని బాలిక. అదే గ్రామానికి చెందిన గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు ఇంట్లో మంచం మీద శవమై కనిపించింది. బాలిక ఒంటిపై గాయాలు ఉండటంతో నాగరాజే హత్యాచారం చేసి పరారయ్యాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.



## గుజరాత్‌లో చాందిపురా వైరస్ కలకలం.. 5 రోజుల్లో ఆరుగురు చిన్నారులు మృతి

గుజరాత్ రాష్ట్రం సబర్‌కాంతా జిల్లాలో చాందిపురా వైరస్ కలకలం రేపుతోంది. ఈ వైరస్ సోకి ఐదు రోజుల్లో ఆరుగురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. మొత్తంగా ఈ వైరస్ బారినపడినవారి సంఖ్య 12కు చేరినట్లు ఆరోగ్య శాఖ మంత్రి రుషికేశ్ పటేల్ తాజాగా వెల్లడించారు.వైరస్ సోకిన 12 మంది రోగుల్లో నలుగురు సంబర్‌కాంత్ జిల్లాకు చెందిన వారని మంత్రి తెలిపారు. ముగ్గురు ఆరావళి, మహిసాగర్, ఖేడా జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. మరో ముగ్గురు మధ్యప్రదేశ్ (ఒకరు), రాజస్థాన్ (ఇద్దరు)కు చెందిన వారని చెప్పారు. ప్రస్తుతం వారంతా గుజరాత్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ అనుమానిత చాందిపురా వైరస్ వల్ల ఆరు మరణాలు సంభవించినట్లు చెప్పారు. అయితే, పూర్తిస్థాయి ధ్రువీకరణ కోసం నమూనాలను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. నమూనాల ఫలితాల అనంతరం ఆ మరణాలు చాందిపురా వైరస్ వల్ల సంభవించాయో లేదో స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ఆరింటిలో ఐదు మరణాలు సబర్‌కాంతా జిల్లాలోని హిమత్‌నగర్‌లోని సివిల్ ఆసుపత్రిలో నమోదైనట్లు మంత్రి తెలిపారు. చాందిపురా వైరస్ అంటు వ్యాధి కాదని మంత్రి పేర్కొన్నారు. అయితే, ప్రభావిత ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నిఘా పెట్టినట్లు చెప్పారు. సుమారు 4,487 ఇళ్లలో 18,646 మంది వ్యక్తులను పరీక్షించినట్లు తెలిపారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధక చర్యలు చేపట్టామని.. ఆరోగ్య శాఖ 24 గంటలు పని చేస్తోందని మంత్రి వివరించారు. మహారాష్ట్రలోని చాందిపురా గ్రామంలో తొలిసారి ఈ వైరస్‌ను గుర్తించారు. ఇది పిల్లలకు వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారికి ఫ్లూ వంటి లక్షణాలతో జ్వరం వస్తుంది. తీవ్రమైన మెదడు వాపు కూడా కనిపిస్తుంది. దోమలు, ఈగలు వంటివాటి ద్వారా ఇది వ్యాపిస్తుంది.



## 18లోపు విచారణకు రండి.. హీరో రాజ్‌తరుణ్‌కు నోటీసులు

హీరో రాజ్ తరుణ్‌కు నార్సింగి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు రావలసిందిగా తాఖీదులిచ్చారు. ఈనెల 18 లోపు తమ ఎదుట హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. బీఎన్‌ఎస్‌ఎస్ 45 కింద రాజ్ తరుణ్‌కు నోటీసులు జారీ చేశారు.హీరో రాజ్‌తరుణ్, తాను పదకొండేండ్లుగా ప్రేమించుకుంటున్నామని, అనేకసార్లు శారీరకంగా కలిశామని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వదిలించుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొంది. ఓ హీరోయిన్‌తో ప్రేమాయణం నడుపుతూ, తనను మోసం చేయాలని చూస్తున్నాడని వాపోయింది. రాజ్‌తరుణ్‌ను వదిలేయాలని లేకపోతే తనను చంపేస్తానంటూ, అతడి సోదరుడు ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నాడని వెల్లడించింది. గతంలో డ్రగ్స్ కేసులో తనను ఇరికించారని, రాజ్‌తరుణ్ కోసం తాను 45 రోజులపాటు జైలులో ఉన్నానని తెలిపింది. రాజ్‌తరుణ్ విచ్చలవిడిగా డ్రగ్స్‌కు అలవాటుపడి అమ్మాయిలతో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నారంటూ 4 పేజీల ఫిర్యాదును నార్సింగి పోలీసులకు అందజేసింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఏ 1 గా రాజ్ తరుణ్, ఏ2 గా మాల్వి మల్హోత్రా, ఏ3గా మయాంక్ మల్హోత్రాన్ని చేర్చుతూ నార్సింగ్ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. ఐపీసీ 420, 493, 506 సెక్షన్ల కింద ముగ్గురిపైనా కేసు నమోదు అయ్యింది. ఈ నెల 13న లావణ్య ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే.


## నిజామాబాద్‌లో విషాదం.. బంధువుల దుష్ప్రచారంతో దంపతుల ఆత్మహత్య

నిజామాబాద్ జిల్లా పోతంగల్‌లో విషాదం చోటుచేసుకున్నది. బంధువులు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మనస్తాపం చెందిన నవ దంపతులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. తమ సూసైడ్‌కు గల కారణాన్ని వివరిస్తూ వీడియో తీసి పోలీసులకు పంపించారు. వారిని కాపాడేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయింది. జిల్లాలోని పోతంగల్ మండలం హెగ్డోలికి చెందిన అనిల్, శైలజ దంపతులకు ఏడాది క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో కలిసి సొంతూరిలోనే ఉంటున్నారు. అయితే సోమవారం ఉదయం ఓ ఇంటర్వ్యూకు వెళ్తున్నామని చెప్పి బయటకు వచ్చారు. మించినా బంధువులు తమపై దుష్ప్రచారం చేస్తుండటాన్ని తట్టుకోలేక ఇద్దరం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు శైలజ ఓ వీడియో తీసి కోటగిరి ఎస్ఐ సందీప్‌కు పంపారు.మా పిన్ని వల్లే తాము చనిపోతున్నామని శైలజ ఆ వీడియోలో పేర్కొన్నారు. గతంలో నేను ఓ తప్పు చేశానని, దానిని క్షమించిన నా భర్త, అత్తామామలు, ఏనాడూ ఎవరితోనూ ఆ విషయం గురించి చెప్పలేదు. కానీ మా పిన్ని ఈ విషయాన్ని మా బంధువుల్లో చాలా మందికి చెప్పింది. ఎవరికీ చెప్పొద్దని మేం కోరినప్పటికీ బంధువులతోపాటు ఇతరులకూ చెబుతున్నది. ఈ వీడియోపై వెంటనే స్పందించిన కోటగిరి ఎస్ఐ సందీప్.. వీడియోతోపాటు సెల్‌ఫోన్ నంబర్‌ను నవీపేట ఎస్ఐకి పంపించారు. దంపతులు ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరి వద్దకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు బాసర వంతెన దగ్గరకు వెళ్లి గాలించారు.

## స్విగ్గీ, జొమాటోలో త్వరలో లిక్కర్ హోమ్ డెలివరీ

ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ మయమైపోయింది. ఫుడ్ నుంచి గ్రాసరీస్ వరకూ అంతా ఆన్‌లైన్ ద్వారానే ఆర్డర్ చేసుకుంటు న్నారు. ఇదే ఆసరాగా చేసుకొని పలు ఆన్‌లైన్ సంస్థలు ఆదాయాన్ని పెంపొం దించుకునే మార్గాలను అన్వేశిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు మద్యం ప్రియులకు కిక్కిచ్చే న్యూస్‌ను చెప్పాయి. స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ వంటి యాప్స్ త్వరలో బీర్, వైన్, లిక్కర్ వంటి తక్కువ ఆల్కహాల్ డ్రింక్స్‌ను హోమ్ డెలివరీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.ఈ సంస్థలు కొన్నేళ్ల క్రితం కేవలం ఫుడ్ మాత్రమే ఆన్‌లైన్‌లో డెలివరీ చేసేవి. ఆ తర్వాత కిరణా సరకులు, కూరగాయలు వంటికి కూడా సరఫరా చేస్తున్నాయి. ఇక ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి ఆల్కహాల్‌ను కూడా డోర్ డెలివరీ చేసేందుకు



ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ముందుగా ఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళ వంటి రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. మద్యం దుకా ణాలకు వచ్చి కొనుగోలు చేయలేని వారి కోసం ఇలాంటి సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకున్నట్లు సంబంధిత అధికా రులు తెలిపారు. 2020 కరోనా సమయం లో లాక్‌డౌన్ విధించిన వేళ మహారాష్ట్ర, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, అస్సాం ప్రాంతాల్లో మద్యం హోమ్ డెలివరీకి అనుమతించారు. అయితే అందుకు కొన్ని షరతులు విధించారు. ఇక ఇప్పటికే మద్యం హోమ్ డెలివరీ అనుమతి ఉన్న ఒడిషా, పశ్చిమ బెంగాల్‌లో ఈ విధానం తీసుకురావడం వల్ల మద్యం అమ్మకాలు 20-30 శాతం పెరిగాయని నివేదికలు వెల్లడించాయి.





## హాట్ లుక్‌లో భాగ్యశ్రీ

ఈ పాటలో రవితేజ, భాగ్యశ్రీ మధ్య కెమిస్ట్రీ అందరి దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ రొమాంటిక్ గా డ్యాన్స్ చేసి అభిమానులను అలరించారు. ముఖ్యంగా భాగ్యశ్రీ డ్రెస్ వెనుక జేబులో రవితేజ చేయి వేసిన డాన్స్ ఇప్పుడు నెట్టింట్ హల్ చల్ చేస్తుంది. టాలీవుడ్ మాస్ మహారాజ్ రవితేజ టైగర్ నాగేశ్వర్రావు తర్వాత తీస్తున్న మూవీ మిస్టర్ బచ్చన్. ఈ సినిమా లో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. రవితేజను మళ్లీ ఎనర్జిటిక్ గా చూపించే ప్రయత్నం చేస్తున్నాడు డైరెక్టర్ హరీష్ శంకర్.రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమా ఆగస్ట్ 15న విడుదల కానుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రచారాన్ని ప్రారంభించిన హరీష్ శంకర్ తాజాగా ఈ సినిమాకు సంబంధించి పవర్ ఫుల్ టీజర్ ను విడుదల చేశారు.తాజాగా ఈ చిత్రంలోని తొలి లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కొద్ది రోజుల క్రితం ఈ పాట ప్రోమో విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్.. ఆర్జిత సేవా టికెట్లకు ఎల్లుండి నుంచే రిజిస్ట్రేషన్

తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్. అక్టోబర్ నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్లు ఎల్లుండి ( ఈ నెల 18వ తేదీన ) విడుదల కానున్నాయి. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల లక్కీ డిప్ కోసం పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చని టీటీడీ తెలిపింది. ఈ నెల 20వ తేదీన లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను టీటీడీ విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవా టికెట్లను అందుబాటులో ఉంచనుంది.ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనం, వసతి గదుల కోటాను విడుదల చేయనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోటా టికెట్లను అందుబాటులో ఉంచనుంది.